క్లుప్తంగా

ప్రజలకు పిన్నెల్లి మహాశివరాత్రి శుభాకాంక్షలు



మాచర్ల : ప్రజలంతా మహా శివరాత్రి సందర్భంగా సుఖశాంతులతో వర్ధిల్లాలని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా ప్రజలకు మహా శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ మహాశివరాత్రి పర్వదినాన్ని ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. శైవ క్షేత్రాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించి, శివుడి ఆశీస్సులు పొందాలన్నారు.

1న వీర బ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం



విజయపురిసౌత్: గోవింద మాంబ సమేత మద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం మార్చి 1న నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త ఆడెపు బ్రహ్మం మంగళవారం తెలిపారు. ఆ రోజు ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరుపుతామన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం, సాయంత్రం స్వామి ఊరేగింపు ఉంటుందని చెప్పారు. భక్తులందరూ స్వామిని దర్శించుకోవాలని ఆయన కోరారు. ఆలయంలో జరుగుతున్న ఏర్పాట్లను కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

లక్ష్మణరావుకు మద్దతు



పిడుగురాళ్ల: ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు ప్రజా సత్తా వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు పులగర శోభనబాబు మంగళవారం మద్దతు తెలిపారు. శోభనబాబు మాట్లాడుతూ..ఎన్నికల్లో మంచి మనసు కలిగిన కె.ఎస్.లక్ష్మణరావును గెలిపించాల్సిన బాధ్యత పట్టభద్రులపై ఉందని పేర్కొన్నారు.

పదిమంది జూదరుల అరెస్ట్

రెంటచింతల: మండలంలోని పశర్లపాడు గ్రామంలో పేకాట ఆడుతున్న పదిమందిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.3,300 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సీహెచ్ నాగార్జున మంగళవారం తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

మాచర్ల: పల్నాడు లయన్స్ క్లబ్ ఉత్తమ సేవలు అభినందనీయమని పురపాలక సంఘ చైర్మన్ పోలూరి నరసింహారావు అన్నారు. మంగళవారం మహా శివరాత్రి సందర్భంగా క్లబ్ ఆధ్వర్యంలో ఆర్టీసీ వలంటీర్లకు ఉచితంగా టోపీలు, బ్యాడ్జిలు పంపిణీ చేశారు. పోలూరి నరసింహారావు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లయన్స్ క్లబ్ మాజీ రీజినల్ చైర్మన్ చుండూరు వెంకటేశ్వర్లు, సాయి మార్కొండారెడ్డి, అల్లం కోటిరెడ్డి, బత్తుల ఏడుకొండలు, డాక్టర్ విడేల హరీష్, సీహెచ్ వెంకటేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

దాచేపల్లి : గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కమిషనర్ ఎంపీ అప్పారావు మంగళవారం తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, నగర పంచాయతీ పరిధిలో 882, రూరల్ మండల పరిధిలో 761 పట్టభద్రుల ఓట్లు కలిపి మొత్తం 1,643 ఓట్లు ఉన్నట్లు ఆయన వెల్లడించారు. ఓటు హక్కు ఉన్న వారు సకాలంలో ఓటు వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



దాచేపల్లి : విద్యార్థులు విలువలతో కూడిన విద్య అభ్యసించాలని నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య అన్నారు. స్థానిక మదర్ థెరిస్సా ఇంగ్లీష్ మీడియం వార్షికోత్సవం మంగళవారం జరిగింది. మాజీ ఎంపీపీ అంబటి నవకుమార్, డీసీ చైర్మన్ పగడాల బాస్కర్‌రావుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ అంబటి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కోర్కెలు తీర్చే మా బుగ్గ మల్లయ్య

నేడు మోర్జంపాడు బుగ్గమల్లేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలు

మాచవరం: మండలంలోని మోర్జంపాడు గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో కృష్ణానది సమీపాన ఉన్న భ్రమరాంబ సమేత బుగ్గ మల్లేశ్వర స్వామి దేవాలయాన్ని శివరాత్రి వేడుకలకు ముస్తాబు చేస్తున్నారు. కాకతీయుల కాలంలో ఈ ఆలయ నిర్మాణం జరిగినట్లు చరిత్ర చెబుతోంది. అంతరాలయం 16 స్తంభాల ముఖ మండపంతో నిర్మితమై ఉంది. గర్భగుడిలో శివలింగం పక్కన నీటి బుగ్గ ఉంది. ఎంత నీటిని తోడినా మరలా అదే స్థాయిలో నీరు నిల్వ ఉండడం ఇక్కడి ప్రత్యేక. ఈ నీటితోనే స్వామి వారికి అభిషేకాలు నిర్వహించడం ఆనవాతిగా వస్తోంది. సూర్యరశ్మి సోకకపోయినా ఇక్కడ నీరు ఎల్లప్పుడూ స్వచ్ఛంగానే ఉంటుంది. కాబట్టి ఇక్కడి పరమేశ్వరుని బుగ్గ మల్లేశ్వరునిగా, బుగ్గ మల్లయ్యగా భక్తులు కొలుస్తారు. శ్రీశైలంలో మాదిరిగానే వాయువ్య దిశలో ఎత్తైన ప్రదేశంలో



మోర్జంపాడులోని బుగ్గమల్లేశ్వరస్వామి

భ్రమరాంబ అమ్మవారు, వృద్ధమల్లేశ్వర స్వామి, దక్షిణాన రామాలయం, తూర్పున క్షేత్రపాలకునిగా ఆంజనేయస్వామి కొలువై ఉన్నారు. ఆలయ ప్రాంగణంలో వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి, నవగ్రహ మండపం, యాగశాల కలవు. ఆలయ ఉత్తర వాహినిగా కృష్ణానది ప్రవహించడంతో ఋషులు, మనీశ్వరులు ఇక్కడ స్నానమాచరించి స్వామివారికి పూజలు చేసుకునే వారని ప్రతీతి. శివకేశవులు ఒకేచోట కొలువై ఉండడంతో విశేషం సంతరించుకుంది.

ఆలయ గుర్తింపు, అభివృద్ధి

అమరావతి సంస్థానాధీశుడైన రాజావాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు (1780–1816) తన పరగణాల పర్యటన నిమిత్తం కామేపల్లి గ్రామానికి విచ్చేయడం జరిగింది. నిష్టపరుడు, శివపూజ చేయనిదే ఆహారం తీసుకునే వారుకాదు. ఊరి పొలిమేరలో శివాలయం ఉండటాన్ని గుర్తించి, ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. దేవాలయ చరిత్రను మండాది సీతారాముడు అనే బ్రాహ్మణుడి ద్వారా తెలుసుకొని, ఆలయం అభివృద్ధికి సహాయ, సహకారం అందించారు. అప్పటి నుంచి మోర్జంపాడు గ్రామానికి చెందిన మండాది వంశస్తులు వంశపారంపర్య ధర్మకర్తలుగా ఉంటున్నారు. కోర్కెలు తీర్చే కొంగు బంగారం మా బుగ్గ మల్లయ్య... అంటూ భక్తులు శివరాత్రి నాడు బారులు తీరనున్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్యకు నమోదు చేసుకోవాలి

మాచవరం: సాగు భూమి కలిగి ఉన్న రైతులందరూ రైతు సేవా కేంద్రాల్లో రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం వివరాలు నమోదు చేయించుకోవాలని ఏఓ కె.రామమ్మ పేర్కొన్నారు. మండలంలోని గంగిరెడ్డిపాలెం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. రైతులకు సాగులో యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కల్లాల్లో ఆరబోసిన కందులను పరిశీలించారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, సున్నా వడ్డీ, పంట రుణాలను పొందాలంటే తప్పని సరిగా రైతుగా నమోదు చేయించుకోవాలని చెప్పారు. ఆధార్, పొలం పట్టాదారు పాసు పుస్తకం జెరాక్స్‌లు, ఆధార్‌కు అనుసంధానమైన ఫోన్ నంబరుతో రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. సిబ్బంది నర్సయ్య, యాకోబు, రైతులు ఉన్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్య ఉండాలి

దాచేపల్లి : రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య ప్రతి రైతు కలిగి ఉండాలని మండల వ్యవసాయశాఖ అధికారిణి డి.పాపకుమారి అన్నారు. ముత్యాలంపాడులో రైతులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఏవో పాపకుమారి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే ప్రతి పథకానికి ఈ గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా ఉండాలన్నారు. పొలం పాసు పుస్తకం, ఆధార్, ఆధార్ లింక్ ఫోన్ నంబర్‌ని రైతు భరోసా కేంద్రాల వద్దకు తీసుకెళ్లి నమోదు చేయించుకోవాలని ఆమె సూచించారు. సర్పంచ్ నెమలికొండ వెంకటచారి, ఎంపీటీసీ పాస వెంకటనాగయ్య, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఏఓ రామమ్మ

భక్తిశ్రద్ధలతో సారంగధరేశ్వరస్వామి తిరునాళ్ల

వైభవంగా శివరాత్రి వేడుకలు

దాచేపల్లి: భక్తుల పాలిట కొంగుబంగారం, కోరిన కొర్కెలు తీర్చే భగవంతుడిగా పేరొందిన సారంగధరేశ్వరస్వామి తిరునాళ్ల మహోత్సవం శివరాత్రి సందర్భంగా బుధవారం నిర్వహించనున్నారు. సారంగపల్లి అగ్రహారం గ్రామ సమీపంలోని కొండపై సారంగధరేశ్వరస్వామి కొలువైయున్నాడు. గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉన్న దేవాలయంలో భక్తుల పాలిట కొంగు బంగారంగా బాసిల్లుతున్నాడు. సారంగధరేశ్వరుడి తిరునాళ్లను శివరాత్రి సందర్భంగా అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొంటారు. స్వామిని దర్శించుకునేందుకు దాచేపల్లి మండలంతో పాటుగా ఇతర మండలాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వస్తారు. ఆలయం ముందు నీటి కొలను ఇక్కడ ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది. భూగర్భజలాలు అడుగంటి పోయినప్పటికిని కొండపై ఉన్న కొలనులో నీళ్లు తొణికిసలాడుతుంటాయి. ఈ కొలనులోని నీళ్లు నెత్తిపై చల్లుకుంటే మంచి జరుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. తిరునాళ్లకి 40 రోజుల ముందు నుంచే భక్తులు శివమాలను ధరిస్తారు. మాలధారులు తిరునాళ్ల సందర్భంగా రాత్రి 11గంటల సమయంలో అగ్నిగుండ ప్రవేశం చేస్తారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయానికి రంగులు వేసి విద్యుద్దీపాలతో అలంకరణ చేశారు. పలు సంస్కృతిక కార్యక్రమాల నిర్వహణతో పాటుగా మహా అన్నదాన కార్యక్రమం చేపడుతున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ భాస్కర్ తెలిపారు.



కొండపై కొలువైన సారంగధరేశ్వరస్వామి

శివరాత్రికి శివాలయాలు ముస్తాబు..

మండలకేంద్రమైన దాచేపల్లిలోని నాగేశ్వరస్వామి సహిత పార్వతీ సమేత ముక్తేశ్వరస్వామి దేవాలయం రెండవ కాశీగా పేరొందింది. జీవనదిగా పిలవబడుతున్న నాగులేరును ఒడ్డున ఉన్న ఈ శివాలయానికి ప్రత్యేక చరిత్ర ఉంది. ఆలయానికి ఒక వైపు నాగులేరు..మరో వైపు హిందూ స్మశాన వాటిక ఉంది. ఈ దేవాలయంలో ఏడుపడగల నాగేంద్రస్వామి దేవాలయం కూడా ఉంది. నాగేంద్రస్వామి శిరస్సు దాచేపల్లిలో, నడుము నాగులేరులో, తోక పెదకొదమగుండ్ల గ్రామంలో ఉన్నట్లు చరిత్ర చెబుతోంది. శివరాత్రి సందర్భంగా శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహిస్తారు. ఆలయ ప్రాంగణంలోని నవ గ్రహాలకు ప్రత్యేకంగా పూజలు చేసిన అనంతరం కల్యాణంను కనుల పండువల జరిపిస్తారు.

భోగభాగ్యాలిచ్చే అమరలింగేశ్వరుడు

అమరేశ్వరుడి దర్శనం సర్వపాపహరణం

గురజాల : పల్నాడు ప్రాంతంలోని భక్తులకు భోగ భాగ్యాలిచ్చే ... అమరలింగేశ్వరుడు మహా శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబయ్యారు. ప్రాచీన చరిత్రకు నిలువెత్తు సాక్ష్యంగా నిలిచిన అమరలింగేశ్వర స్వామిని దర్శించుకోవడం ఎంతో అనుభూతి కలుగుతుందని భక్తుల నమ్మకం. మండల పరిధిలోని దైద గ్రామ సమీపంలో కృష్ణానది తీరంలో బిలంలో కొలువై స్వామి మహా శివరాత్రి ఉత్సవాలకు సిద్ధమయ్యారు. ప్రతి సంవత్సరం ఇక్కడ శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి.

దేవాలయ విశిష్టత

కృష్ణానది తీరంలో బిలంలో వెలిసిన శ్రీ అమరలింగేశ్వర స్వామి వారి మహిమలు కొకల్లలు. పులిపాడు గ్రామానికి చెందిన కోంద్రు రామయ్య వందేళ్ల క్రితం పశువులను మేపుకునేందుకు నదీతీరానికి వెళ్లాడు. కొండపై ఆరె చెట్టు కింద భోజనం చేసి విశ్రాంతి తీసుకుంటుండగా.. భజనలు, సంకీర్తనల శబ్దం రామయ్య చెవులకు వినిపించింది. పొద్దున్నే తల్లిదండ్రులను పూజించండి... పవిత్రంగా అమరలింగేశ్వరుడిని భక్తితో కొలవండి...అంటూ కీర్తనలు వినిపించడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడి రామయ్య నిద్రలేచాడు. గ్రామస్తులలకు విషయం చెప్పడంతో..వారంతా వెతకగా పురాతనమైన బిలం బయటపడింది. బిలంలోకి వెళ్లగా ఎన్నో మార్గాలు కనిపించాయి. కోంద్రు రామయ్యకు శరవాణి శ్లోకం వినిపించిన మార్గంలో వెళ్లగా ఒక గర్భాలయం కంటపడింది. కొంతసేపటికి అక్కడ ఉన్న చెట్టును తొలగించగా దివ్యమైన లింగాకారం కనిపించింది. ఇంతలో ఒకరికి స్వామి పూని ఇక నుంచి మీ చెంతనే ఉంటానని చెబుతుండగా.. శివలింగం నుంచి శక్తివంతమైన వెలుగు మాయమైంది. అప్పటి నుంచి పల్నాడు ప్రాంత వాసుల ఆరాధ్యదైవంగా స్వామి పూజలందుకుంటున్నాడు.

– శివరాత్రి ఉత్సవాల్లో భక్తులతో కోలాహలంగా ఆలయం ఉంటుంది. కృష్ణానదిలో స్నానమాచరించి బిలంలో కొలువై ఉన్న అమరలింగేశ్వర స్వామి వారిని భక్తులు దర్శించుకుంటారు. శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు అన్ని పూర్తి చేశామని దేవదాయ దర్మదాయ శాఖ కార్యనిర్వహణాదికారి పూర్ణచంద్రరావు తెలిపారు. స్నానమాచరించిన మహిళలకు ప్రత్యేకంగా గదులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బిలంలోకి వెళ్లి భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. మంచి నీటి వసతి, అన్నదానం చేయనున్నట్లు చెప్పారు.

– ఆలయానికి గుంటూరు నుంచి వచ్చే భక్తులు.. మాచర్ల బస్సు ఎక్కి గురజాలలో దిగాలి. గురజాల బస్టాండ్ సమీపంలో దైద బస్సులు, ఆటోలు అందుబాటులో ఉంటాయి. గురజాల నుంచి సుమారుగా 18 కిలోమీటర్లు దూరంలో కృష్ణానది తీర పరివాహక ప్రాంతంలో స్వామి వారి దేవాలయం కనిపిస్తుంది. మాచర్ల నుంచి వచ్చేవారు.. గుంటూరు బస్సులు ఎక్కి గురజాలలో దిగాలి.



బిలంలోకి వెళ్లు మార్గం



బిలంలో కొలువైన అమరలింగేశ్వర స్వామి

రైల్వేస్టేషన్‌ని కమ్మేసిన బొగ్గు దుమ్ము





నడికుడి రైల్వేస్టేషన్‌లో ప్లాట్ ఫాంపై పేరుకుపొయిన బొగ్గు దుమ్ము..

దాచేపల్లి : నడికుడి రైల్వే స్టేషన్‌ని బొగ్గు దుమ్ము కమ్మేసింగి. స్టేషన్‌లోని ఐదవ నంబర్ ప్లాట్ ఫాం పక్కనే వ్యాగన్ల నుంచి బొగ్గుని అన్‌లోడింగ్ చేస్తున్నారు. దీంతో గాలికి బొగ్గు దుమ్ములేసి ప్లాట్‌ఫాంలను కప్పేసింది. ప్రయాణికులు రాకపోకలు సాగించే ప్రధాన ప్లాట్ ఫాంపై బొగ్గు పేరుకుపోవడంతో ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్లాట్ ఫాంపై రైలు వచ్చేంత వరకు ప్రయాణికులు స్టేషన్ బయట పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్లాట్ ఫాంపై ఉంటే దుమ్ముతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్టేషన్ ఆనుకుని ఓ ప్రైవేట్ స్కూల్, రైల్వే క్వార్టర్స్, చుట్టూ నివాస గృహాలు ఉన్నాయి. స్టేషన్‌లోనే వ్యాగన్ నిలిపి వేసి బొగ్గు అన్‌లోడింగ్ చేయడంతో ఈ ప్రాంతమంతా బొగ్గుతో పేరుకుపోయింది. ప్రయాణికులు లేని స్టేషన్‌లో బొగ్గు అన్‌లోడింగ్ చేయకుండా నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే నడికుడి రైల్వేస్టేషన్‌లో అన్‌లోడింగ్ చేయడం పట్ల ప్రయాణికులు తీవ్ర అంసతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రైల్వే అధికారులు స్పందించి ఈ సమస్యకు పరిష్కారం చూపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వివరాలు నమోదు చేసుకోవాలి

మంచికల్లు(రెంటచింతల): భారత ప్రభుత్వం సమన్వయంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రారంభించిన ఫార్మర్ రిజిస్ట్రేషన్ పోర్టర్‌లో పేర్లు నమోదు చేసుకున్న రైతులకు ఇచ్చే 11 అంకెల గుర్తింపు సంఖ్య ఆధారంగానే రాయితీపై ఎరువులు ఇవ్వడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. మంగళవారం మంచికల్లు సచివాలయంలో రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. రైతులకు అన్ని పథకాలను పారదర్శకంగా అందజేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం దీనిని ప్రారంభించిందన్నారు. వివరాలు మోదు చేసుకున్న రైతులకు 11 అంకెల విశిష్ట సంఖ్యతో మంజూరు చేసే ప్రత్యేక గుర్తింపు కార్డు ఇవ్వనున్నట్లు చెప్పారు. రైతులు వెంటనే ఆధార్ జెరాక్స్, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబరు, పట్టాదారు పాస్‌బుక్ తీసుకుని రైతు సేవా కేంద్రంలోని వీఏఏలను సంప్రదించాలని తెలిపారు.

మద్యం షాపులు మూత



మాచర్ల: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బార్ అండ్ వైన్ షాపులను మంగళవారం మూసివేశారు. సాయంత్రం 5 గంటలకు ఎక్సైజ్ పోలీసులు బార్లు, మద్యం షాపులక తాళాలు వేసి, సీలు వేశారు. పట్టణంలోని మూడు బార్లు, మూడు వైన్ షాపులు ఉన్నాయి.

ఘనంగా మహా శివరాత్రి ఏర్పాట్లు

కారెంపూడి: మహా శివరాత్రి పర్వదిన వేడుకలకు మండలంలోని శివాలయాలు నిర్వాహకులు ముస్తాబు చేస్తున్నారు. చింతపల్లి గ్రామంలోని దొడ్డ మల్లేశ్వరస్వామి తిరునాళ్లను వైభవంగా జరుగుతాయి. ప్రభలు కట్టడంతో పాటు వందేమాతరం శ్రీనివాస్ ఆధ్వర్యంలో మ్యూజికల్ నైట్, అలాగే భరత నాట్య ప్రదర్శనలు, జబర్దస్త్ ఆర్టిస్టుల హాస్య వల్లరి కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఒప్పిచర్ల గ్రామ శివారు నల్లమల అడవిలో వేంచేసిన ధనమల్లయ్యస్వామి ఉత్సవాలకు గ్రామస్తులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామి కొండకు వెళ్లడానికి ఉచిత రాకపోకలు ఏర్పాట్లు చేయడంతో పాటు అక్కడకు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేశారు. చారిత్రక ప్రసిద్ధి చెందిన కారెంపూడి సూరేశ్వరాలయం, కొదమగుండ్ల శివాలయం, ఒప్పిచర్ల, మిరియాల మిగతా అన్ని గ్రామాల్లో ఏర్పాట్లు జరుగుతున్నాయి.



ధన మల్లయ్య స్వామి

మెళకువలు పాటించడం ద్వారా మిర్చికి అధిక ధర

డాట్ సెంటర్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎం.నగేష్

బెల్లంకొండ: మిర్చి పంట కోత పూర్తయిన తర్వాత ఆరబెట్టడంలో మెలకువలు పాటించడం ద్వారా అధిక ధర పొందవచ్చని డాట్ సెంటర్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం.నగేష్ తెలిపారు. మండలంలోని పాపాయపాలెం గ్రామంలో మంగళవారం మిరప పంటలో సమగ్ర సస్యరక్షణ చర్యలపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కోత అనంతరం మిరపకాయలను శిల్పాలిన్ పట్టాలపై ఆరబెట్టుకోవాలని, తాలుకాయలు ఏరిన తరువాత కాయల్లో తేమ లేకుండా చూసుకోవాలని సూచించారు. అదేవిధంగా రెండవ కోతకు వచ్చిన మిరప పంటలో నల్ల తామర పురుగు నివారణకు రైతులకు పలు సూచనలు చేశారు. మండల ఉద్యాన శాఖ అధికారి వై.మోహన్ మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో టమాటా సాగు చేసిన రైతులు మార్కెటింగ్ శాఖ ద్వారా గిట్టుబాటు ధరకు పంటను అమ్ముకోవాలని తెలిపారు. రైతులకు కిలో రూ.8 నుంచి 10లు గిట్టుబాటు ధర వచ్చే విధంగా ఉద్యాన, మార్కెటింగ్ శాఖలు అనుసంధానంతో రైతుల నుంచి టమాటా కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన సిబ్బంది ఎం.వంశీ, రజిని, రైతులు పాల్గొన్నారు.



పాపాయపాలెంలో మిర్చి రైతులకు సూచనలిస్తున్న ఉద్యాన అధికారులు

చిరు పొట్ట దశలో వరికి ఎరువులే కీలకం

నకరికల్లు: చిరు పొట్ట దశలో ఉన్న వరి పంటకు ఎకరాకు 25 నుంచి 30 కేజీల యూరియా 20 కేజీల పొటాష్ ఎరువులను చల్లాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. మండలంలోని కుంకలగుంట, జిల్లాపేటతండా గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతు సేవ కేంద్రాల్లో ఫార్మర్ రిజిస్టర్ ఐడీ నంబర్ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందజేసే సంక్షేమ పథకాలకు ఫార్మర్ ఐడీ నంబర్ అవసరమని అన్నారు. రైతులు తమ ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కు లింక్ చేసిన ఫోన్ నంబర్‌తో రైతు సేవ కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించి ఫార్మర్ ఐడీ నంబర్ పొందాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు షేక్ నవాజ్‌షరీఫ్, పీహెచ్‌ఏ పి.సాయివెంకట్, రైతులు పాల్గొన్నారు.

నత్రజని ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): పంటల సాగులో రసాయనిక ఎరువులు, నత్రజని ఎరువుల వాడకాన్ని తగ్గించాలని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ చెప్పారు. మండలంలోని గోళ్లపాడు, కుందురువారిపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ పాల్గొని మొక్కజొన్న సాగులో కత్తెర పురుగు నివారణకు విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. సాగు చేసిన పంటల వివరాలను ఈ–క్రాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ దేవిడ్‌రాజు, రైతులు పాల్గొన్నారు.



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏఓ అరుణ, రైతులు

ఆకట్టుకున్న విద్యార్థుల సైన్స్ ప్రదర్శనలు

అచ్చంపేట: నేషనల్ సైన్స్ డే సందర్భంగా స్థానిక బ్లూ బెల్స్ హైస్కూలులో విద్యార్థులు నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పో ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, జెడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్ రెడ్డి వేర్వేరుగా హాజరై విద్యార్థుల ప్రదర్శనల పట్ల ఆకర్షితులయ్యారు. 6 నుంచి 10 తరగతుల విద్యార్థులు తమలో ఉన్న మేధాశక్తిని ప్రదర్శించారు. వాటర్ ప్యూరిఫైయర్ ద్వారా మురుగునీరు ఎలా శుభ్రమవుతుంది, సౌరశక్తిని ఎలా తయారు చేస్తారు, ఉపగ్రహాల ప్రయోజనాలు, బ్లెడ్ గ్రూప్ ఎలా తెలుసుకుంటారు, మానవుని గుండె, మూత్రపిండాలు ఎలా పనిచేస్తాయి అనే విషయాలను విద్యార్థులు ప్రయోగాత్మకంగా చేసి, వివరించడం సందర్శకులను ఆకట్టుకుంది. ప్రదర్శనలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు జెడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఇదే పాఠశాల ఆవరణలో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో 250 మందికి, సిబార్ హాస్పిటల్ గుంటూరు వారిచే 350 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఆపరేషన్లు చేసేందుకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ నిర్మల జ్యోతి, హెచ్ఎం మేరి శ్రీలత, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ప్రదర్శనలు తిలకిస్తున్న జెడ్పీటీసీ విజయప్రతాప్‌రెడ్డి

నేడు విద్యుత్ బిల్లులు చెల్లింపునకు అవకాశం

మాచర్ల: పట్టణంలోని విద్యుత్ వినియోగదారులు విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు బుధవారం ఈఆర్‌ఓ ఆఫీసు పనిచేస్తుందని ఏఈ రామయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించి సహకరించాలని పేర్కొన్నారు.

పిడుగురాళ్ల: వినియోగదారులు బుధవారం కూడా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని విద్యుత్ శాఖ పిడుగురాళ్ల పట్టణ టౌన్ ఏఈ ఎం.సైదారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహా శివరాత్రి రోజున కూడా కొండ మోడులోని కరెంట్ ఆఫీసు నందు ఉదయం 10.30 నుంచి సాయంత్ర 4 గంటల వరకు బిల్లులు చెల్లించే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు.

వివాహిత ఆత్మహత్య

దాచేపల్లి : అనారోగ్యంతో బాధపడుతూ వివాహిత ఆత్మహత్య చేసుకుందని ఎస్ఐ సౌందర్యరాజన్ మంగళవారం తెలిపారు. దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న బండ్ల సత్యం భార్య రూతమ్మ(50) కొంతకాలంగా రూతమ్మ అనారోగ్యంతో బాధపడుతోంది. అనారోగ్య కారణాలతో మానసిక ఒత్తిడికి గురై.. ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందని భర్త సత్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు. మృతురాలికి భర్త, నలుగురు కుమార్తెలు ఉన్నారు.

1 నుంచి లక్ష్మీనారసింహుని దీక్షలు ప్రారంభం

బెల్లంకొండ: స్వయంభూ కేతవరం శ్రీ వజ్ర లక్ష్మీనరసింహస్వామి దీక్షలు మార్చి 1 నుంచి ప్రారంభమవుతాయని మండల దేవదాయ శాఖ ఈవో అవుదూరి వెంకటేశ్వర రెడ్డి తెలిపారు. వచ్చే నెల ఒకటి, రెండు తేదీల్లో దీక్షలు చేపట్టేందుకు మాలధారులకు అవకాశం ఉందని తెలిపారు. దీక్షలకు సంబంధించి ఆలయ ప్రాంగణంలో అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆలయ ట్రస్ట్ చైర్మన్ పాశం నరసింహారెడ్డి, ఈమని వెంకటరెడ్డి తెలిపారు.